# అన్నదాత ఆక్రందన...

## రేపటి నుంచే అఖిలభారత ఐక్య రైతు సంఘం ప్రథమ మహాసభలు

- హాజరుకానున్న పదివేల మందికిపైగా రైతులు.. ముఖ్య నాయకులు
- ఎజెండాలు వేరైనా సమస్యలపై కొట్లాడేందుకు అంతా ఏకం కావాలి
- కార్పొరేట్ కోరల్లో చిక్కుకున్న వ్యవసాయం..
- విముక్తి కోసం రైతు కదం తొక్కాలి
- ఏఐయూకేఎస్ ఆల్ ఇండియా కన్వీనర్ కెచ్చల రంగారెడ్డి

## ఇల్లందు వేదికగా సమర గర్జన!

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మే9(నినాదం)

**దేశానికి వెన్నెముక అని చెప్పుకునే రైతు నేడు అప్పుల ఊబిలో కూరుకుపోయి విలవిలలాడుతున్నాడు. పాలకుల కార్పొరేట్ ప్రేమ వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టేసింది. ఈ నేపథ్యంలో, దేశవ్యాప్త రైతాంగ పోరాటాలను ఏకం చేస్తూ అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) తన ప్రథమ మహాసభలకు ఇల్లందు గడ్డను వేదికగా ఎంచుకుంది. ఈ మహాసభల ప్రాముఖ్యతపై ఏఐయూకేఎస్ ఆల్ ఇండియా కన్వీనర్ కెచ్చల రంగారెడ్డితో నినాదం ప్రత్యేక ముఖాముఖి...**

**ఈ ప్రథమ మహాసభల ప్రధాన ఆశయం, ఆవశ్యకత ఏమిటి?**

నేడు దేశంలో రైతు పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం, మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద, కార్పొరేట్ అనుకూల విధానాలే ఈ వినాశనానికి కారణం. వ్యవసాయ రంగంపై కార్పొరేట్ శక్తుల పెత్తనం పెరిగింది. విత్తనం నుంచి అమ్మకం వరకు ప్రతిచోటా రైతు దోపిడీకి గురవుతున్నాడు. ఈ పరిస్థితుల్లో రైతాంగాన్ని సంఘటితం చేసి, "వ్యవసాయాన్ని రక్షించుకుందాం – అన్నదాతను కాపాడుకుందాం" అనే నినాదంతో ఈ మహాసభలను నిర్వహిస్తున్నాం.

**ప్రభుత్వం చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో రైతు అనుభవిస్తున్న కష్టాలకు మధ్య వైరుధ్యం ఏమిటి?**

ప్రభుత్వాలు కాగితాల మీద భారీ పథకాలు ప్రకటిస్తాయి, కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నం. పంట పెట్టుబడి ఖర్చులు (ఎరువులు, పురుగుమందులు, డీజిల్) భారీగా పెరిగాయి. కానీ, పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు ఏమైంది? అప్పుల బాధ తాళలేక రైతులు సాగును వదిలేసి కూలీలుగా మారుతున్నారు, మరికొందరు ప్రాణాలు తీసుకుంటున్నారు. గ్రామాలు వెలవెలబోతున్నాయి. ఈ పాలకుల అబద్ధాలను ఎండగట్టడానికే మేము ఈ మహాసభల ద్వారా రైతు గొంతుకను దిల్లీ దాకా వినిపించబోతున్నాం. అయితే రైతు సమస్యలను ఒక్కో సంఘం ఒక్కో రీతిన పరిష్కరించాలన్న ఎజెండాతో ముందుకు సాగుతున్నారు. కానీ రైతు సమస్యలపై అంతా ఒక్కతాటిపైకి వచ్చి కొట్లాడితే సమస్యపై ప్రభుత్వాలు దిగొచ్చే అవకాశం ఉంటుంది. అందుకు ఈ మహాసభల ద్వారా స్పష్టమైన సందేశం ఇవ్వనున్నాము. అందుకు తగిన కార్యచరణ చర్చించనున్నాము.



**ఈ సభలో పాల్గొంటున్న కీలక నేతలు ఎవరు?**

ఈ సభ ఒక చారిత్రాత్మక వేదిక కాబోతోంది. ఏఐయూకేఎస్ ఆల్ ఇండియా కన్వీనర్ కెచ్చల రంగారెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సభలో ప్రజా గొంతుక, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, జాతీయ నాయకులు ప్రదీప్ సింగ్ ఠాగూర్, విమల్ త్రివేది. మహిళా సంఘాల నేతలు చంద్ర అరుణ, కట్ట రామ, వరంగల్, ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల ఏఐయూకేఎస్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొంటారు.

**రైతాంగంతో పాటు ఇతర వర్గాల మద్దతు ఎలా ఉంది?**

ఇది కేవలం రైతుల సభ మాత్రమే కాదు. వ్యవసాయం మీద ఆధారపడి జీవించే వ్యవసాయ కార్మికులు, పేదలు అందరి సభ. అందుకే అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపికెఎంఎస్) రాష్ట్ర నేతలు ఎం. కృష్ణ, నాయని రాజు వంటి వారు కూడా తమ మద్దతు ప్రకటించారు. రైతులు, కూలీలు కలిస్తేనే పాలకుల గుండెల్లో నిదురపోగలమని మా నమ్మకం.

**చివరగా.. రైతాంగానికి, ప్రజలకు మీరిచ్చే పిలుపు?**

రైతన్నలారా.. ఆత్మహత్య పరిష్కారం కాదు, ఆత్మగౌరవంతో కూడిన పోరాటమే మన మార్గం! ఇల్లందు గడ్డ పోరాటాల గడ్డ. ఈ రోజు సాయంత్రం నాలుగు గంటలకు మీరంతా మీ నాగలిని, గొడ్డలిని పక్కన పెట్టి, జెండా పట్టి కదలి రండి. ఫారెస్ట్ గ్రౌండ్ నుంచి సింగరేణి గ్రౌండ్ వరకు జరిగే ప్రదర్శనలో మీరు వేసే ప్రతి అడుగు.. కార్పొరేట్ శక్తులకు హెచ్చరిక కావాలి. అరుణోదయ కళాకారుల పాటల్లో మన కష్టం, మన పోరాటం వినిపిస్తుంది. సమైక్యంగా ఉందాం.. సమరశంఖం పూరిద్దాం. ఈ మహాసభను జయప్రదం చేయడం అంటే మన భవిష్యత్తును మనం కాపాడుకోవడమే!. మే 11, 12, 13 తేదీలలో మూడు రోజుల పాటు జరిగే ఈ మహాసభల ముగింపు తీర్మానాలు దేశవ్యాప్త రైతు ఉద్యమాలకు దిశానిర్దేశం చేయనున్నాయి.




# రైతు సంక్షేమమే లక్ష్యం

- సాగునీటి కాలువల మరమ్మతులు చేపట్టాలి
- సింగభూపాలెం చెరువు వద్ద 'రైతు వారోత్సవాలు'
- పాల్గొన్న కొత్తగూడెం 21వ డివిజన్ కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి

**సుజాతనగర్, మే 10:**
ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువు ప్రాంతంలో నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం 'రైతు వారోత్సవాలు' ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ 21వ డివిజన్ కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి గారు పాల్గొని ప్రసంగించారు.

**అధికారులకు విజ్ఞప్తి -- రైతుల సమస్యలే ప్రాధాన్యం**

ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రావణి మాట్లాడుతూ, రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు కీలక సూచనలు చేశార. సింగభూపాలెం చెరువు కట్ట కుంగిన ప్రాంతంలో తక్షణమే మరమ్మతులు చేపట్టి, ప్రొటెక్షన్ వాల్ నిర్మించి కట్టను కట్టుదిట్టం చేయాలని అధికారులను కోరారు. అలుగు పోసినప్పుడు వరద ఉధృతికి పంట పొలాలు మునిగిపోకుండా అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే సాగునీటి కాలువల పూడికతీత, మరమ్మతులు పూర్తి చేసి రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. చెరువులో పేరుకుపోయిన సారవంతమైన మట్టిని రైతులు తమ పంట పొలాలకు తరలించుకుని, భూసారాన్ని పెంచుకోవాలని ఆమె సూచించారు.

**పాల్గొన్న ప్రముఖులు**

ఈ కార్యక్రమంలో కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, మేయర్ మూడ్ గణేష్, కొత్తగూడెం సహకార సంఘం చైర్మన్ మండే వీర హనుమంతరావు పాల్గొన్నారు. వీరితో పాటు ఇరిగేషన్, పోలీస్, వ్యవసాయ శాఖల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మరియు మండల పరిధిలోని పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు.